క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, దూపదర్శనం పూజలు నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు బాలాజీ ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ ఆధ్వర్యాన అన్నదానం ఏర్పాటు చేశారు.

సమాజ శ్రేయస్సు కోసం సైకిల్ యాత్ర



యాత్ర చేస్తున్న గోపాలకృష్ణతో శివనాగస్వామి

దుమ్ముగూడెం: సమాజ శ్రేయస్సు కోసం కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లా సింగనూరుకు చెందిన చాత్రాతి విజయగోపాలకృష్ణ చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం మండలంలోని నర్సాపురం గ్రామానికి చేరింది. ఈసందర్భంగా శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ చిన్న అరుణాచలేశ్వర ఆలయంలో వ్యవస్థాపకులు శివనాగస్వామి స్వాగతం పలికారు. కాగా, గోపాలకృష్ణ 2022 మార్చి 11న తన స్వగ్రామం నుంచి బయలుదేరగా 430 రోజుల్లో 15 రాష్ట్రాల్లోని దేవాలయాలను సందర్శించారు. జల, జంతు, వన సంరక్షణ నినాదంతో సమాజ శ్రేయస్సు కోసం ఈ యాత్ర చేపట్టినట్టు తెలిపారు.

టీజేఎస్ ప్లీనరీని జయప్రదం చేయాలి

అశ్వాపురం: తెలంగాణ జన సమితి(టీజేఎస్) మొదటి జిల్లా ప్లీనరీ మంగళవారం పాల్వంచలో జరగనుందని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కరపత్రాలు పంపిణీ చేశాక ఆయన మాట్లాడారు. ప్లీనరీకి తెలంగాణ ఉద్యమ రథసారధి, పార్టీ అధ్యక్షుడు కోదండరాం హాజరవుతున్న నేపథ్యాన అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, పిప్పల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

మణుగూరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు సోమవారం పరామర్శించారు. మణుగూరు మండలానికి చెందిన జాటోత్ కృష్ణ, మంగమ్మతో పాటు ఇటీవల మరణించిన గుగులోత్ బాలాజీ కుటుంబీకులను పరామర్శించి మాట్లాడారు. నాయకులు రామిడి రామిరెడ్డి, కంభంపాటి శ్రీను, బుద్దుల ప్రసాద్, కణితి ప్రవీణ్‌కుమార్, కట్ట రాజ్‌కుమార్, శరత్, సుతారి వెంకన్న, నాంపల్లి కార్తీక్, షెహనాజ్, సుజాత, గౌస్య పాల్గొన్నారు.

'ఉపాధి' పథకాన్ని తొలగించే కుట్ర

అశ్వాపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మోకాళ్ల రమేష్ విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో కేంద్రం తీసుకొస్తున్న నిబంధనలతో అర్హులకు పని దక్కడం లేదని తెలిపారు. ఈమేరకు బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా కార్మికులు సిద్ధం కావాలని ఆయన కోరారు.

నగదు తిరిగి జమ చేసిన ఉపాధ్యాయురాలు

భద్రాచలంటౌన్: పొరపాటున ఫోన్ పే ద్వారా గుర్తు తెలియని వ్యక్తికి నగదు జమ చేయగా.. తిరిగి పంపించిన ఘటన ఇది. భద్రాచలానికి చెందిన చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వసంతకుమారి ఖాతాకు మహబూబాబాద్‌కు చెందిన మదనగోపాల్ పొరపాటున ఫోన్ పే ద్వారా రూ.12,400 వేలు జమ చేశాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా మదనగోపాల్ ఆమెకు ఫోన్ చేయగా సోమవారం తిరిగి పంపించింది. దీంతో మదనగోపాల్ కృతజ్ఞతలు తెలిపాడు.

బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

చంద్రుగొండ: ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి తీసుకోకుండా మండలంలో ఇటుకబట్టీల నిర్వహణ సాగుతోందని ఏజెన్సీ దళితుల సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు నద్ది రవికుమార్ ఆరోపించారు. బట్టీల్లో బాలకార్మికులతో పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఈమేరకు వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు.

పని భారం.. వేతనాలు దూరం

- పంచాయతీ కార్మికులకు సక్రమంగా అందని జీతాలు
- కుటుంబ పోషణకు ఇక్కట్లు పడుతున్న వైనం



పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

చర్ల: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సక్రమంగా వేతనాలు అందడం లేదు. వచ్చే అరకొర వేతనాలు కూడా ప్రతీ నెలా చెల్లించకుండా మూడు, నాలుగు నెలలకోకసారి ఇస్తుండడంతో కుటుంబాలు గడవక కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. చర్ల పంచాయతీలో 29 మంది, ఆర్.కొత్తగూడెం పంచాయతీలో ఐదుగురు, దేవరాపల్లి, కలివేరు, కేశవాపురం, కుదునూరు, తేగడ, ఉప్పరిగూడెం పంచాయతీల్లో నలుగురు చొప్పున, చినమిడిసిలేరు, గొమ్ముగూడెం, గొంపల్లి, కొత్తపల్లి, కొయ్యూరు, లక్ష్మీకాలనీ, లింగాపురం, పెదమిడిసిలేరు, పూసుగుప్ప, సత్యనారాయణపురం, తిప్పాపురం గ్రామ పంచాయతీల్లో ముగ్గురు, బోదనెల్లి, సి.కత్తిగూడెం, కుర్నపల్లి, మొగళ్లపల్లి, పులిగుండాల, సుబ్బంపేట జీపీల్లో ఇద్దరు, పెద్దిపల్లిలో ఒక్కరు చొప్పున మొత్తం 26 గ్రామపంచాయతీల్లో 104 మంది కార్మికులను మల్టీపర్పస్ విధానం ద్వారా నియమించారు.

లెక్కలేనన్ని పనులు..

పంచాయతీల పరిధిలో ఇంటి పన్నులు వసూళు చేయడం, వీధుల్లో చెత్త సేకరణ, డ్రెయినేజీలు, రోడ్లు, పల్లె క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలను శుభ్రం చేయడం, వీధి దీపాలు వేయడం, వ్యాటర్ ట్యాంకుల నుంచి నీళ్లు వదలడం ఇలా చెప్పుకుంటూ మల్టీపర్పస్ వర్కర్లు చేయాల్సి పనులు ఒకటీ, రెండు కావు. ఇందుకోసం ప్రభుత్వం పంచాయతీకి ముగ్గురు నుంచి పది మంది వరకు కార్మికులను నియమించింది. అయితే, లెక్కలేనన్ని పనులకు వినియోగిస్తుండగా వీరు తీవ్రంగా ఒత్తిడికి గురవుతున్నారు. ఈ క్రమంలో నెలకు రూ.8,500 వేతనం చెల్లించాల్సి ఉన్నా ఏ నెలకానెల కాకుండా మూడు, నాలుగు నెలలకు ఒకసారి చెల్లిస్తుండడంతో అవస్థ పడుతున్నారు. పలుమార్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలను నిర్వహించినా ఫలితం ఉండడం లేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పని ఒత్తిడి తగ్గించడమే కాక నెలనెలా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

పనిభారంతో ఇబ్బంది పడుతున్నాం..



పంచాయతీల్లో అన్ని పనులు మాతోనే చేయిస్తున్నారు. ప్రత్యేకంగా ఒక పని అంటూ కేటాయించడం లేదు. దీంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. అలాగే, భారంగా మారుతోంది. పనిభారం తగ్గించేందుకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కల్లూరి నర్సింహారావు, కలివేరు పంచాయతీ

నెలనెలా వేతనాలు చెల్లించాలి



ప్రతీ నెల వేతనాలు చెల్లించాలి. మూడు నాలుగు నెలలకోసారి చెల్లిస్తుండడంతో పిల్లల్ని చదివించుకోలేక, ఇతర ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నాం. అరకొరగా చెల్లించే వేతనాలనైనా ప్రతీనెల చెల్లిస్తే కొంత మేర ఇబ్బందులు తొలగుతాయి.

– మజ్జూరి నాగరాజు, మొగుళ్లపల్లి పంచాయతీ

క్రీడా పోటీలతో స్నేహభావం పెరుగుతుంది..

ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: క్రీడా పోటీలతో స్నేహభావం పెరుగతుందని, మానసికోల్లాసం కలుగుతుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గుమ్మడవల్లిలో జరుగుతున్న క్రికెట్ లీగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈమేరకు మొదటి రెండు స్థానాల్లో నిలిచిన ఆకులకుంట్ల వీర్రాజు, నకిరికంటి నాగు జట్లకు ఎమ్మెల్యేలు ట్రోఫీలు అందజేశారు. అనంతరం పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలోని మహిళా డిగ్రీ కళాశాలలో సమస్యలను స్థానికులు వివరించగా ఎమ్మెల్యే అక్కడి నుంచే ఐటీడీఏ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తితో పాటు వల్లెపు తిరుపతిరావు, మందపాటి మోహన్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వరరావు, పుట్టా సత్యం పాల్గొన్నారు.

పార్కలగండిలో విగ్రహ ప్రతిష్ఠాపన

దమ్మపేట: మండలంలోని పార్కలగండిలో బొడ్రాయి, అభయాంజనేయస్వామి, గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. గ్రామంలో సోమవారం విగ్రహాలను ప్రతిష్ఠించగా ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సాగర్‌తో పాటు నాయకులు కొయ్యల అచ్యుతరావు, దారా యుగేందర్, రాయల నాగేశ్వరరావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మ జయంతి



భాగ్యరెడ్డివర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ లలిత

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని కార్యాలయాల్లో సోమవారం భాగ్యరెడ్డివర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సున్నం లలిత, తహసీల్‌లో తహసీల్దార్ భద్రకాళి తదితరులు భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత జాత అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎంపీఓ షబ్నా, నుద్యోగులు పాల్గొన్నారు.

పోడు భూముల సమస్యపై వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అశ్వాపురం: మండలంలోని వెంకటాపురం, మామిళ్లవాయి గ్రామాల్లో రెవెన్యూ, పోడు భూముల సమస్యలపై సర్పంచ్ మడకం సాధు ఆధ్వర్యాన సోమవారం కొత్తగూడెంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. 27, 71 సర్వే నంబర్లలో గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, బొర్రా శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డీపీఓ తనిఖీలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పేరాయిగూడెం, అశ్వారావుపేట గ్రామపంచాయతీల్లో సోమవారం డీపీఓ లక్కినేని రమాకాంత్ పర్యటించారు. పారిశుద్ధ్య వారోత్సవాల నేపథ్యాన ఆయా జీపీల్లో జరుగుతున్న పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. చెత్తచెదారాన్ని ప్రతిరోజు తొలగించాలని, మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని, రహదారుల పక్కన పిచ్చి మొక్కల్ని తొలగించాలని తెలిపారు. అలాగే పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులను కుడా పరిశీలించారు. ఎంపీఓ సీతారామరాజు, ఈఓ హరికృష్ణ, కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, శ్యాం పాల్గొన్నారు.

గిరిజన ఎమ్మెల్యేలు వ్యతిరేకించాలి

భద్రాచలంటౌన్: ఎస్టీ జాబితాలో 11 బీసీ కులాలను చేర్చేలా రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని గిరిజన ఎమ్మెల్యేలు వ్యతిరేకించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బీసీ ఉప కులాలలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే తీర్మానానికి అనుకూలంగా వ్యవహరించిన ఎస్టీ ఎమ్మెల్యేల క్యాంపు కార్యాయాలను ఈనెల 25న ముట్టడించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పొడియం కుమారి, కొమరం భద్రమ్మ, కారం సమ్మక్క, పద్మ పాల్గొన్నారు.

ముస్లింలపై దుష్ప్రచారానికే సినిమా



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

భద్రాచలంఅర్బన్: ముస్లిం మైనార్టీలపై దుష్ప్రచారం చేస్తూ వారిని దేశంలో ఒంటరి వారిగా చేసే కుట్రలో భాగంగానే బీజేపీ, అనుబంధ అనుబంధ సంఘాలు కల్పిత కట్టుకథగా 'కేరళ స్టోరీ' సినిమాను రూపొందించాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య విమర్శించారు. భద్రాచలంలో సోమవారం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బీ.నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ముస్లింలను ఉగ్రవాదులుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు.కాశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ తదితర సినిమాలతో ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, కారం పుల్లయ్య, యలమంచిలి వంశీకృష్ణ, మర్లపాటి రేణుక, భీమవరపు వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, నాదెండ్ల లీలావతి, పారెల్లి సంతోష్ కుమార్, బెల్లంకొండ కుసుమ, నాగరాజు, లక్ష్మణ్, కొరడా శ్రీనివాస్, మున్నాఫ్, ఎం.డీ.సర్వర్, యాకూబ్ మియా, సుకూర్, రబ్బానీ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మణుగూరు రూరల్: తుంగతుర్తికి చెందిన న్యాయవాది యుగంధర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ రోజురోజుకు న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని చెప్పారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్వకేట్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు వలసాల శైలజ, సంధ్య, కందిమళ్ల నర్సింహారావు, నగేష్‌కుమార్, రామ్మోహన్‌రావు, భాస్కరరావు, మధు, నాగార్జునరెడ్డి, గద్దల సాంబ, వాసవి, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సలీం

అశ్వారావుపేటరూరల్: కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యాన వచ్చే నెల 4న జరగనున్న బహిరంగ సభకు తరలిరావాలని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎస్.డీ.సలీం కోరారు. స్థానిక మియాజానీ భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ విజయవంతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, భారీ స్థాయిలో జనసమీకరణ చేయాలని సూచించారు. తొలుత గుండెపోటుతో మృతి చెందిన ఏఐటీయూసీ నాయకుడు తిర్నాటి సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నాయకులుగన్నిన రామకృష్ణ, వగ్గెల అర్జున్‌రావు, ఎస్.డీ.రఫీ, సంగం కృష్ణమూర్తి, చీపుర్ల సత్యవతి, షేక్ దిల్షాద్, రిజ్వాన, శ్రీను, నాగరాజు, సూరయ్య పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో విస్తృత తనిఖీలు



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

చంద్రుగొండ: మండలకేంద్రంలోని విత్తనాల దుకాణాల్లో పోలీస్, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఏ అఫ్జల్‌బేగం, జూలూరుపాడు సీఐ వసంత్‌కుమార్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన వారే విత్తనాలు విక్రయించాని, రికార్డులు సక్రమంగా నిర్వహిస్తూ ప్రతీ రైతుకు రశీదు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు పాటించకపోయినా, నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు నకిలీ విత్తనాలు రాకుండా అడ్డుకునేందుకు బూర్గుడెం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని తెలిపారు. తనిఖీల్లో ఏఓ వినయ్, ఎస్‌ఐ గొల్లపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

దమ్మపేట మండలంలో..

దమ్మపేట: మండలంలోని దమ్మపేట, మందలపల్లి గ్రామాల్లో విత్తనాల విక్రయ దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. టాస్క్‌ఫోర్ ఎస్సై వంశీ నేతృత్వాన షాపుల్లో నిల్వలు, రికార్డులను పరిశీలించి వివరాలు ఆరా తీశారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఓ చంద్రశేఖరరెడ్డి, ఎస్సై రవికుమార్, ఏఈఓ రవీందర్ పాల్గొన్నారు.

స్టాక్ బోర్డులు తప్పనిసరి

పినపాక: ఎరువుల దుకాణాల్లో స్టాక్ బోర్డులు తప్పక ఏర్పాటు చేసి, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సీఐ రాజగోపాల్ సూచించారు. మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో అగ్రికల్చర్ అధికారులతో కలిసి సోమవారం తనిఖీలు చేపట్టారు. అనుమతి లేకుండా షాపు నడిపినా, నకిలీ విత్తనాలు అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నాగుల్ మీరా పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్డు, భద్రాచలం, సత్తుపల్లి రోడ్లలోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో సీఐ బొమ్మెర బాలకృష్ణ, టాస్క్‌ఫోర్స్ ఎస్సై వంశీ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. విత్తనాలు, ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించి అమ్మకాలపై సూచనలు చేశారు. ఎస్సై బి.రాజేశ్‌కుమార్, ఏఓ నవీన్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

చర్ల: పత్తి, వరి, మిర్చి ఇతర విత్తనాలు, ఎరువులు విక్రయించే డీలర్లు విధిగా నిబంధనలు పాటించాలని చర్ల తహసీల్దార్ బి.భరణిబాబు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో డీలర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడీఓ సుధాకర్, ఏఓ శివరాంప్రసాద్, డీలర్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం



డార్విన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేవీవీ ప్రతినిధులు

బూర్గంపాడు: అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బూర్గంపాడులోని ఔట్‌రీచ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతానికి మూలం జీవవైవిధ్యమేనని తెలిపారు. ప్రకృతిలోని జీవుల మనుగడకు అడవులను కాపాడుకోవాలని సూచించారు. తొలుత డార్విన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేవీవీ ప్రతినిధులు ప్రగళ్ల సాయి, నరేష్, శ్రీనివాస్, జోష్న,అజయ్, చరణ్, కామేష్ పాల్గొన్నారు.

భద్రాచలంలో...

భద్రాచలంఅర్బన్: పట్టణంలో సోమవారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోళ్ల భూపతిరావు మాట్లాడుతూ జీవ సమతుల్యత దెబ్బతిని పక్షుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. వైల్డ్ లైఫ్ మెంబర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పక్షి జాతులు నశించకుండా జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి కృష్ణ, ఋషి, కడలి నాగరాజు, ప్రియాంక, ఊటుకూరు సాయి పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30 లక్షలు చెల్లించాలి



ధర్నాలో పాల్గొన్న నిర్వాసిత రైతులు

చర్ల: సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంతో నిర్వాసితులవుతున్న రైతులకు ఎకరాకు రూ.30 లక్షల పరిహారం చెల్లించాలని పలువురు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవరం దేవరాపల్లిలో సీతమ్మ సాగర్ భూనిర్వాశితుల సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు సీతారామరాజు, ఎస్‌వీఎల్ఎన్.రాజు మాట్లాడుతూ ఎకరాకు రూ.30 లక్షల పరిహారం లేదా భూమికి బదులు సాగుభూమి ఇవ్వాలని, వర్షాకాలంలో వరదలతో నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యాక్రమంలో కొమరం దామోదర్, నర్సింహారావు, వీరేంద్రకుమార్, భీమరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య వారోత్సవాలు

మణుగూరు రూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయితీ పరిధి వలస ఆదివాసీ గ్రామమైన రేగులగండిలో సర్పంచ్ ఏనిక ప్రసాద్ ఆధ్వర్యాన ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈమేరకు సోమవారం వీధుల్లో రోడ్డుకిరువైపులా, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు,పల్లె ప్రకృతి వనంలోని పిచ్చిమొక్కలను తొలగించారు. అలాగే, తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి వి.సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

అశ్వారావుపేటరూరల్: బాల్య వివాహాలు చేసి బాలల జీవితాలకు నష్టం కలిగించొద్దని సీడీపీఓ రోజారాణి అన్నారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో సోమవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలతో పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని చెప్పారు. ఆడ, మగ తేడా లేకుండా అందరికీ చదువు చెప్పించి జీవితంలో స్థిరపడ్డాకే వివాహాలు జరిపించాలని సూచించారు. సూపర్‌వైజర్లు పద్మావతి, సౌజన్య, అంగన్‌వాడీ టీచర్లు సుందరి, సావిత్రి పాల్గొన్నారు.

తేగడలో వైద్యశిబిరం



గ్రామస్తులను పరీక్షిస్తున్న వైద్యబృందం

చర్ల: మండలంలోని తేగడలో జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యాన సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సత్యనారాయణపురం వైద్యాధికారి ఎం.దివ్యనయన ఆధ్వర్యాన 50 మందికి పరీక్షలు నిర్వహించడంతో పాటు జ్వరంతో బాధపడుతున్న 17 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. డాక్టర్ మోనిక, హెల్త్ సూపర్‌వైజర్ కనకదుర్గ, సిబ్బంది వరలక్ష్మి, దీప్తి, పార్వతి, రాజేశ్వరి, వరప్రసాద్, వేణు, సుబ్బారావు, కనకమ్మ పాల్గొన్నారు.

ప్రయాణంలో ఆహ్లాదం!



హరితహారం కింద మూడేళ్ల క్రితం రహదారి పక్కన నాటిన మొక్కలు ప్రస్తుతం ఎదిగాయి. మండు వేసవిలో ఈ చెట్లకు పూసిన పూలు వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అశ్వారావుపేట మండలం ఆసుపాక దగ్గర వినాయకపురం–భద్రాచలం వెళ్లే మార్గంలో ప్రధాన రహదారికి ఇరువైపులా తురాయి చెట్లు నాటగా ఎర్రని రంగులో పూసిన పూలు వాహనదారులను స్వాగతం పలుకుతున్నట్లుగా కనిపిస్తున్నాయి.

– అశ్వారావుపేట రూరల్